

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం.

శ్రీకాకుళం సంపుటి: 1 సంచిక: 33 సోమవారం 25 డిసెంబరు 2023 పేజీలు : 4 వెల: 7.00

## లోకరక్షకుడి జన్మదినం

# విశ్వమంతా పర్వదినం



**శ్రీకాకుళం, డిసెంబరు 24 (వార్త):** ఏసుక్రీస్తు జనియించిన సుదినం. లోకరక్షకుడి జన్మదినం విశ్వమంతా పర్వదినం. మానవాళికి శాంతి సందేశం అందించడానికి ఏసు భువి పైకి అరుదెంచిన రోజు క్రిస్మస్. ఏసుక్రీస్తు జననాన్ని ప్రపంచానికి సూచిస్తూ నక్షత్ర కాంతులు విరజిమ్మాయి. అతని రాకను స్వాగతిస్తూ ప్రార్ధనా మందిరాలు ముస్తాబయ్యాయి. సోమవారం క్రిస్మస్ నేపథ్యంలో శ్రీకాకుళం నగరం ముస్తాబైంది. చర్చిలు, ఇళ్లు క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్, స్టార్ తదితర అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో ధగధగమెరిసింది. జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభ మయ్యాయి. ఆనందోత్సవాల నడుమ క్రైస్తవులు లోకరక్షకుడికి కొవ్వొత్తులు వెలిగించి ఆహ్వానం పలికారు. చర్చిల ఆవరణలో క్రీస్తు పుట్టిన పశువుల శాల ఘట్టాలు, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్, స్టార్‌లతో ప్రార్ధన మందిరాలు కళకళలాడాయి. పండగ సందర్భంగా తారల కాంతిలో ఆరాధనా మందిరాలు ప్రకాశించాయి. చర్చిల ఆవరణల్లో శాంతి సందేశాలు పాటల రూపంలో ప్రతిధ్వనించాయి. శ్రీకాకుళం నగరంలోని కీస్టోన్ చర్చి, తెలుగు బాప్టిస్టు, క్రైస్తవ ఆరాధన, ఆర్‌సీఎం, తదితర చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కీస్టోన్ చర్చిలో చిన్నారుల లఘునాటిక అలరించింది. హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ ర్యాలీలు చేశారు. చర్చిలు, ఇళ్లల్లో కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. చిన్నారుల శాంతాక్లాజ్ వేషధారణ ఆకట్టుకుంది. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఆరాధన మందిరాలు కిటకిటలాడాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

* జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు
* విద్యుత్ ధగధగలతో చర్చీలు, ఇళ్లు
* అర్ధరాత్రి నుంచి చర్చీల్లో ప్రత్యేక ప్రార్ధనలు
* కీస్టోన్ చర్చిలో అలరించిన లఘు నాటిక
* ఆకట్టుకున్న క్రిస్మస్ ట్రీ, పశువుల శాల ఘట్టాలు
* అలరించిన శాంతి సందేశాల గీతాలాపన
* హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ క్రైస్తవుల ర్యాలీ



















# హ్యాపీ క్రిస్మస్



## లోకరక్షకుడు క్రీస్తు

# జన్మదినమే క్రిస్మస్

ఏసుక్రీస్తు పుట్టిన రోజునే ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగ చేసుకుని ఎంతో పవిత్రంగా భావిస్తారు. జీసస్ జన్మించి నేటికి వేల ఏళ్లు దాటినా కరుణామయుడుగానూ, దయామయుడుగానూ క్రైస్తవులతో ఆరాధనలను అందుకుంటున్నాడు. 2 వేల ఏళ్ల కిందట రోమ్ సామ్రాజ్యాన్ని పాలించే ఆగస్టస్ సీజర్ తన రాజ్యంలో ఎంత మంది జనాభా ఉన్నారో లెక్కించాడు. సులభంగా ఈ లెక్కలు సేకరించడానికి వీలుగా ప్రజలందరూ ఎవరి స్వగ్రామాలకు వాళ్లు డిసెంబరు 25 తేదీలోగా చేరుకోవాలని ఆజ్ఞాపించాడు. అదే సమయంలో రోమన్ సామ్రాజ్యంలోని నజరేతు పట్టణంలో ఉండే మేరీతో జోసెఫ్‌కు పెళ్లి కుదిరింది. ఒక రోజున మేరీకి గాబ్రియేల్ అనే దేవదూత కలలో కనబడి 'ఓ మేరీ! నీవు దైవానుగ్రహం పొందావు. కన్యగానే గర్భం దాల్చి ఓ కుమారునికి జన్మనిస్తావు.. అంతే కాదు పుట్టే బిడ్డకు ఏసు అని పేరు పెట్టాలని, అతడు దేవుని కుమారుడు' అని తెలియజేసింది. ఏసు అంటే రక్షకుడు అని అర్థం. దేవదూత చెప్పిన విధంగానే మేరీ గర్భం దాల్చింది. ఈ విషయం తెలిసిన జోసెఫ్ ఆమెను వివాహం చేసుకోరాదని నిర్ణయించుకున్నాడు. అయితే ఒక రోజు రాత్రి కలలో అతనికి దేవదూత కనపడి 'మేరీని నీవు విడిచిపెట్టవద్దు. ఆమె భగవంతుని వరంతో గర్భవతి అయింది. కాబట్టి ఆమెకు పుట్టే కొడుకు దేవుని కుమారుడు. తనను నమ్మిన ప్రజలందరిని వాళ్ల పాపాల నుంచి రక్షిస్తాడు' అని పలికింది. జోసెఫ్ దైవాజ్ఞను అనుసరించి మేరీని ప్రేమతో ఆదరించాడు. ఇక, రాజాజ్ఞ ప్రకారం జోసెఫ్, మేరీలు తమ స్వగ్రామమైన బెత్లేహామ్‌కు బయలుదేరారు. అయితే, వారు అక్కడకు చేరుకునేసరికి ఉండటానికి వసతి దొరకలేదు. చివరకు ఒక సత్రం యజమాని తన పశువుల పాకలో వారికి ఆశ్రయం కల్పించాడు. అక్కడే ఏసుకు మేరీ జన్మనిచ్చింది. ఆ రాత్రి ఆ ఊరికి పక్క పొలాల్లో కొంతమంది తమ గొర్రెల మందలకు కాపలా కాస్తున్నారు. ఆ సమయంలో ఆకాశం నుంచి ఒక దేవదూత వారి ముందుకు దిగి వచ్చాడు. ఆ దూత చుట్టూ వెలుగులు ప్రసరించడంతో గొర్రెల కాపర్లు భయపడ్డారు. 'మీరు భయపడకండి, ఒక సంతోషకరమైన శుభవార్తను తెలియజేయడానికి ఇక్కడకు వచ్చాను.. ఈ రోజు బెత్లెహెూమ్‌లోని ఓ పశువుల పాకలో లోక రక్షకుడు పుట్టాడు, ఆయనే మీ అందరికీ ప్రభువు... ఒక పసికందు గుడ్డల్లో చుట్టి, పశువుల తొట్టిలో అమ్మ పొత్తిళ్లలో పడుకుని ఉంటాడని, ఇవే మీకు ఆనవాళ్లని, అతడే లోకరక్షకుడు' అని చెప్పాడు. గొర్రెల కాపర్లతో ఈ విషయం గురించి చెబుతుండగానే ఆ ప్రాంతమంతా ఆకాశం నుంచి దిగివచ్చిన దేవదూతలతో నిండిపోయింది. అలా అక్కడకు వచ్చిన దేవదూతలు దేవుని స్తుతిస్తూ గీతాలు పాడి మాయమయ్యారు. గొర్రెల కాపరులు హుటాహుటిన దేవదూత చెప్పిన పశువుల పాకను చేరుకున్నారు. అక్కడ పశువుల తొట్టిలో పడుకొని ఉన్న శిశువుతోపాటు మేరీ, జోసెఫ్‌లను చూశారు. దేవదూత తమకు చెప్పిన విషయాన్ని వారు అందరికి తెలియజేశారు. అలా రెండు వేల సంవత్సరాల కిందట డిసెంబరు 24 న అర్ధరాత్రి 12 తర్వాత జీసస్ జన్మించాడు. అంటే డిసెంబరు 25న జన్మించడంతో ఆ రోజునే క్రిస్మస్ చేసుకుంటారు. క్రిస్మస్‌కు చాలా రోజుల ముందే పండుగ సందడి మొదలవుతుంది. దీనికోసం క్రైస్తవులు తమ ఇళ్లను, చర్చిలను అందంగా అలంకరిస్తారు. వెదురు బద్దలు, రంగుల కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి ఇంటిపై వేలాడ దీస్తారు. అలాగే తమ ఇంట్లో క్రిస్‌మస్ ట్రీ ఏర్పాటు చేస్తారు. దీన్ని రంగు రంగుల కాగితాలు, నక్షత్రాలు, చిరుగంటలు, చిన్న చిన్న గాజు గోళాలతోను అలంకరిస్తారు. ఇది ఈ పండుగ ప్రత్యేకత. క్రిస్మస్ ముందు రోజు రాత్రి శాంతా క్లాజ్ ఆకాశం నుంచి ధృవపు జింకలు లాగే బండిలో వచ్చి పిల్లలకు బహుమతులు ఇచ్చి వెళ్తాడని నమ్ముతారు. అందుకోసం పిల్లలు తమ మేజోళ్లను వేలాడదీసి ఉంచుతారు. ఇలా ఉంచితే శాంతా క్లాజ్ వాటిలో బహుమతులను వేసి వెళ్తాడని నమ్మకం. క్రిస్‌మస్ రోజున బంధు మిత్రుల ఇళ్ళకు వెళ్లి శుభాకాంక్షలు తెలుపుతారు. క్రిస్‌మస్ ఏడాదికి ఒకసారి మాత్రమే వస్తుంది కాబట్టి వచ్చేటప్పుడు ప్రేమాభిమానాలను సుఖసంతోషాలను తెస్తుందని నమ్ముతారు.








జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
రాష్ట్ర, జాతీయ వార్తలు







# హ్యాపీ క్రిస్మస్





# క్రిస్మస్ ట్రీ



క్రిస్మస్ కాంతులు సమీపించాయి. శ్రీకాకుళం జిల్లాలోని పలు ఇళ్లల్లో, చర్చ్‌ల్లో ఎత్తయిన క్రిస్మస్ ట్రీలు వెలిశాయి. క్రిస్మస్ వచ్చిందంటే ఇంటింటా స్త్రీలు, పిల్లలు క్రిస్మస్ ట్రీని అలంకరించేందుకు ఉత్సాహపడతారు. క్రిస్మస్ ట్రీని అనేక థీమ్‌లతోఅలంకరించవచ్చు. క్రిస్మస్ ట్రీ కథనూ ఈ సారి అనువైన థీమ్‌లను తెలుసుకుందాం. క్రిస్మస్ అంటే ప్రపంచమంతా నక్షత్రాలు పూసే వేళ. కేకులు సువాసనలు వెదజల్లే వేళ. కానుకలు రిబ్బన్ ముక్కల్లో అందంగా ప్యాక్ అయ్యే వేళ, శాంటా కోసం పిల్లలు ఎదురు చూసే వేళ, ప్రతి ఇంట్లో క్రిస్మస్ చెట్టు చిగురించే వేళ. ఏసుక్రీస్తు జన్మదినాన జగతి అంతా రంగులను హత్తుకుంటుంది. కురిసే మంచును కేరింతలతో కోస్తుంది. చర్చ్ గంటలు గణగణమోగుతాయి. స్తోత్రగీతాలు హోరెత్తుతాయి. కొవ్వొత్తులు రెపరెపలాడతాయి. క్రిస్మస్ వేళ ప్రతి ఇంటిపై క్రిస్మస్ స్టార్ వెలుగుతుంది. అలాగే క్రిస్మస్ చెట్టు కూడా కొలువుదీరుతుంది. జన సంస్కృతి నుంచి మెల్లగా పండుగలోకి వచ్చిన చిహ్నం ఇది. శీతల దేశాలలో శీతాకాలం కడు దుర్భరంగా ఉంటుంది. జీవేచ్ఛ అడుగంటుతుంది. అందుకని అప్పటి ప్రజలు పచ్చటి పైన్ లేదా ఫర్ చెట్టు కొమ్మలను తెచ్చి ఇంటి బయట వాటిని అలంకరించేవారు. ఇది పాజిటివ్ వైబ్రేషన్స్‌ను తెస్తుందని భావించేవారు. క్రీస్తు జన్మదినం కూడా శీతాకాలంలో వస్తుంది కాబట్టి ఈ అలంకరణ మెల్లగా ఒక దేశం నుంచి మరో దేశానికి పాకి క్రిస్మస్‌తో జత కలిసింది. క్రిస్మస్ ట్రీని సతత హరిత జీవనానికీ, జీవితేచ్ఛకూ చిహ్నంగా భావిస్తారు. పచ్చగా వర్ధిల్లమనే కామన క్రిస్మస్ ట్రీ. క్రిస్మస్ పండగనాడు ఒక చర్చిలో ఏసు ప్రభువు విగ్రహం ఎదుట అందరూ ఖరీదైన కానుకలు పెడుతుంటే ఒక పేద బాలుడు ఒక పచ్చటి మొక్కను పెట్టాడట. ఆ మొక్క వెంటనే బంగారు కాంతులీనిందట. అప్పటి నుంచి నిరాడంబరమైన ఆరాధనకు గుర్తుగా క్రిస్మస్ ట్రీ వచ్చిందని ఒక కథ. క్రిస్మస్ ట్రీ అలంకరణలో నాలుగు రంగులు కనపడతాయి. తెలుపు రంగు ఇది స్వచ్ఛతకు గుర్తు. కురిసే మంచుకు కూడా. అందుకే క్రిస్మస్ ట్రీలో పత్తిని తెల్లదనానికి ఉపయోగిస్తారు. ఎరుపు రంగు ఇది క్రీస్తు రక్తానికి, త్యాగానికి చిహ్నం. శాంటా కూడా ఈ రంగు దుస్తులనే ధరిస్తాడు. ఆకుపచ్చ రంగు ఇది క్రీస్తు సజీవతను గుర్తు చేస్తుంది. బంగారు రంగు ఇది సంపదకు, మానవాళికి బహుమతిగా దక్కిన ఏసు మార్గానికి గుర్తు. ఒకప్పుడు ఫర్, పైన్ చెట్ల కొమ్మలను తెచ్చే క్రిస్మస్ ట్రీని తయారు చేసేవారు. ఆ తర్వాత చైనా నుంచి కృత్రిమ చెట్లు వచ్చాయి. కేవలం క్రిస్మస్ ట్రీల కోసమే అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలలో 25 రకాల పైన్, ఫర్ చెట్లను సాగు చేస్తున్నారు. ఇవి ఆరడుగుల ఎత్తు పెరగడానికి ఎనిమిది నుంచి పన్నెండేళ్లు పడతాయి.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

సోమవారం 25 డిసెంబరు 2023





# ముస్తాబైన చర్చ్‌లు

క్రిస్మస్‌ను పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లాలోని పలు చర్చ్‌లను నిర్వాహకులు ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రార్థనా మందిరాలను అందంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ పండుగను వేడుకగా చేసుకునేందుకు క్రైస్తవ సోదరులు సన్నద్ధమయ్యారు.




























EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY: CHOWDARI PRAMODKUMAR, OPP.80, HUDCO COLONY, SRIKAKULAM, PIN :532001, A.P,, PRINTED AT :JATHEEYA VARTHA PRINTING PRESS, OPP.80, HUDCO COLONY, SRIKAKULAM, PIN :532001, A.P,, EDITOR : SHAIK SAHID, Email : vaarthachowdary@gmail.com, Cell: 9963063761